సత్యదేవుని సన్నిధిలో ఎమ్మెల్యే విజేతల పూజలు - 7లో

పవన్ కల్యాణ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వర్మ

రికార్డుల మోత!

- ఎన్నికల ఫలితాల్లో 'మెజార్టీ' రికార్డులు
- గత ఎన్నికల్లో ఎప్పుడూ రానంతగా నమోదు
- ఉమ్మడి 'తూర్పు'లో ఏడు నియోజకవర్గాల్లో 50వేలకుపైనే దాటేసిన ఆధిక్యతలు
- కాకినాడ రూరల్‌లో అత్యధికంగా పంతం నానాజీకి 72వేలపైనే మెజార్టీ
- ఆ తర్వాత రాజమహేంద్రవరం సిటీ 71వేలు, పిఠాపురంలో 70వేలపైమాటే
- రాజమహేంద్రవరం రూరల్, కాకినాడ సిటీ, కొత్తపేట, జగ్గంపేటల్లోనూ రికార్డుల మోతే
- ఈ నియోజకవర్గాల్లో ఐదేళ్లలో శృతిమించిపోయిన వైసీపీ అరాచకాలు, అక్రమాలు
- అధికారం అండతో యథేచ్ఛగా దోపిడీ, దౌర్జన్యాలు, బూతుల దండయాత్రలు
- చంద్రబాబును జైలుపాలు చేయడంతో వైసీపీని ఈడ్చికొట్టిన రాజమహేంద్రవరం ప్రజలు
- కాకినాడ సిటీ, కొత్తపేటల్లో అవినీతికి వైసీపీ ఎమ్మెల్యేలపై జనంలో తీవ్ర తిరుగుబాటు
- సీఎం జగన్ సామాజికవర్గం సాకుతో ఐదేళ్లుగా వీరిద్దరి అరాచకాలపై జనాగ్రహం


ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు టీడీపీ కూటమికి ఓట్ల వరద సృష్టించారు. అవినీతి, అక్రమాలతో నిండా మునిగిపోయి ప్రజల స్వేచ్ఛను హరించేసిన వైసీపీని ఉతికి ఆరేశారు. ఈవీఎంలపై కసిగా నొక్కి ఫ్యాన్‌ను భూస్థాపితం చేశారు. దీంతో టీడీపీ, జనసేన నుంచి పోటీచేసిన అభ్యర్థులు కనివినీ ఎరుగని మెజార్టీలతో నియోజకవర్గాల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రజలు ఇచ్చిన ఏకపక్ష తీర్పుతో ఇది వరకు ఎమ్మెల్యేలుగా నెగ్గిన అభ్యర్థుల గత రికార్డులు సైతం తుడిచిపెట్టుకుపోయాయి. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో కూటమి అభ్యర్థులంతా వేలాది ఓట్ల మెజార్టీలతో గెలుపొందారు. కానీ వీటిలో ఉమ్మడి జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో మాత్రం ఓటర్లు వైసీపీపై ఒకరకమైన కసి, కోపంతో కూటమికి ఓట్ల వరద పారించారు. మిగిలిన నియోజకవర్గాలతో పోల్చితే అంతుచిక్కనంత అనూహ్య మెజార్టీలు కట్టబెట్టారు. అంతా కూడబలుక్కునట్టు ఉప్పెనలా కదిలి ఓట్లేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కాకినాడ రూరల్, రాజమహేంద్రవరం సిటీ, పిఠాపురం, రాజమహేంద్రవరం రూరల్, కాకినాడ సిటీ, కొత్తపేట, జగ్గంపేట నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులు ఏకంగా 50 వేల నుంచి 72వేలకుపైగా మెజార్టీలు దక్కించుకున్నారు. ఒకరకంగా చెప్పాలంటే గత ఏ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ నియోజకవర్గాల నుంచి నెగ్గిన ఎమ్మెల్యేలకు ఈ స్థాయి మెజార్టీలు రాలేదు. కానీ ఇప్పుడు ఏ నియోజకవర్గాల్లోనూ లేనివిధంగా ఇక్కడే సరికొత్త రికార్డు ఆధిక్యతలు రావడానికి కారణాలేమిటనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



పంతం నానాజీ (జనసేన)
మెజారిటీ : 72,040



ఆదిరెడ్డి శ్రీనివాస్ (టీడీపీ)
మెజారిటీ : 71,404



పవన్‌కల్యాణ్ (జనసేన)
మెజారిటీ : 70,279



బుచ్చయ్యచౌదరి (టీడీపీ)
మెజారిటీ : 64,090



వనమాడి కొండబాబు (టీడీపీ)
మెజారిటీ : 56,573



బండారు సత్యానందరావు (టీడీపీ)
మెజారిటీ : 56,479



జ్యోతుల నెహ్రూ (టీడీపీ)
మెజారిటీ : 52,676

(కాకినాడ–ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అధికార వైసీపీ నేతలు ఈ అయిదేళ్లలో అధికారం అడ్డుపెట్టుకుని సాగించిన దురాగతాలు, బెదిరింపులే ఈ స్థాయిలో ప్రజలు స్పందించడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఆ కోపమే కూటమి అభ్యర్థులకు ఓట్ల వర్షం కురిపించిందనే చర్చ జరుగుతోంది. కాకినాడ రూరల్‌లో మాజీ మంత్రి కన్నబాబు అధికారం అండతో అవినీతితో రెచ్చిపోయారు. కుటుంబం మొత్తం నియోజకవర్గాన్ని జుర్రేశారు. దీంతో ఇక్కడ అవినీతిపై ప్రజలకు విసుగొచ్చేసింది. ప్రతి పనికి రేటు నిర్ణయించేసి సదరు నేత కోట్లకు పడగలెత్తారు. అలాగే ఇక్కడ ఎన్నికల ప్రచారం చేసిన పవన్ ఎమ్మెల్యే కన్నబాబు అవినీతిపై విరుచుకుపడ్డారు. ఒకప్పుడు డొక్కు సైకిల్‌పై తిరిగిన కన్నబాబు, ఇప్పుడు వెయ్యి కోట్లు సంపాదించారని ఆధారాలతో నిరూపించారు. ఇక్కడ జనసేన అభ్యర్థి పంతం నానాజీకి ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా ఏకంగా 72వేలకుపైగా మెజార్టీ వచ్చేలా చేసింది. అటు రాజమహేంద్రవరం సిటీలో ఆదిరెడ్డి వాసు టీడీపీ నుంచి 71 వేలకుపైగా మెజార్టీతో నెగ్గారు. నిజానికి రాజమండ్రి సిటీలో, రూరల్ లోనూ పోలింగ్ శాతం తక్కువ నమోదైంది. అయినాగానీ ఇక్కడ భారీ మెజార్టీలు వచ్చాయి. పోలింగ్ శాతం పెరిగే ఇంకెంత మెజార్టీ వచ్చేదో మరి. ఇదో కొత్త చరిత్ర. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే టీడీపీ నుంచి ఆదిరెడ్డి భవానీ ఉన్నారు. కానీ అధికారంలో ఉన్నది వైసీపీ కావడంతో ఆ పార్టీ ఎంపీ భరత్ తన వ్యవహార శైలితో రాజమహేంద్రవరం ప్రజల్లో వైసీపీపై ఒకరకమైన ఏహ్యాభావం కలిగించేలా చేశారు. అవినీతి ఆరోపణలు, రెచ్చగొట్టే బూతులు, సాధ్యంకాని హామీలతో నవ్వులపాలయ్యారు. అలాగే ఆదిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని జగన్ ప్రభుత్వం అరెస్టులు చేయడం, వారి వ్యాపారాలపై దెబ్బకొట్టడం ప్రజల్లో ఆదిరెడ్డి కుటుంబంపై సానుభూతి పెంచింది. అన్నింటికీ మించి స్కిల్ కేసులో అక్రమంగా అరెస్టైన చంద్రబాబును నెలల తరబడి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉంచడంతో ఇక్కడి ప్రజలు వైసీపీ అరాచకాలను నేరుగా చూశారు. దీంతో ఎన్నికల్లో ఓటుతో వైసీపీని కసితీరా చితక్కొట్టారు. రాజమండ్రి రూరల్ నుంచి కూటమి తరపున టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి ఆయనకు ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి మంత్రి వేణుకంటే 64,090 ఓట్లు మెజార్టీ లభించింది. 11సార్లు ఎన్నికల్లో పోటీచేసిన గోరంట్ల 7వసారి అసెంబ్లీకి ఎన్నికై మరో రికార్డు సృష్టించారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌ను ఓడించడానికి వైసీపీ పన్నని కుట్రలు, కుతంత్రాలంటూ లేవు. కడప నుంచి బృందాలు రావడం, కోట్లు కుమ్మరించడం ఇవన్నీ ప్రజల్లో వైసీపీపై అసహ్యాన్ని పెంచాయి. ఎన్నికల చివరి రోజు జగన్ సభ, ఎమ్మెల్యే అభ్యర్థి గీత ఏడుపు నటనలు జనంలో వైసీపీపై నిలువెత్తు కోపం పెంచాయి. ఇదంతా పవన్‌పై అక్కసుతోనే అని గ్రహించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా బుచ్చయ్యచౌదరి ఉన్నారు. కానీ ఇక్కడకు వైసీపీ అభ్యర్థిగా అవినీతిలో మునిగిపోయిన మంత్రి వేణు రామచంద్రపురం నుంచి బదిలీపై రావడం మైనస్‌గా మారిపోయింది. పైగా ఇక్కడ వైసీపీ సాగించని అవినీతంటూ లేకుండా పోయింది.

పార్లమెంటు అభ్యర్థులకూ భారీ మెజారిటీలు

ఇక పార్లమెంట్ కూటమి అభ్యర్థిగా గెలిచిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎన్టీఆర్ కూతురు దగ్గుబాటి పురందేశ్వరికి 2,39,139 ఓట్ల మెజార్టీ లభించింది. జిల్లాలో గతంలో ఎన్నడూ ఎవరికీ ఇంత మెజార్టీ లభించలేదు. గతంలో టీడీపీ ఎంపీగా గెలిచిన మాగంటి మురళీమోహన్ లక్షా 60వేల ఓట్లు సాధించి రికార్డు సాధించగా, పురందేశ్వరి ఆ రికార్డును కూడా బ్రేక్ చేశారు. అలాగే అమలాపురం పార్లమెంటు టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన గంటి హరీష్‌మాధుర్ (బాలయోగి)కి 3,42,196 ఓట్ల మెజారిటీ లభించింది. ఇది కూడా ఒక చరిత్రే. కాకినాడ పార్లమెంటు జనసేన కూటమి అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించిన తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు 2,29,491 ఓట్ల మెజారిటీ లభించింది. మొత్తానికి కాకినాడ, అమలాపురం, రాజమండ్రి పార్లమెంటు స్థానాల నుంచి మెజారిటీల విషయంలో రికార్డుల మోత మోగించారు.

వారిద్దరి అరాచకం అంతా ఇంతా కాదు...

కాకినాడ సిటీ, కొత్తపేటల్లో వైసీపీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి, జగ్గిరెడ్డి ఇద్దరూ అవినీతికి నిలువెత్తు రూపాలుగా మారారు. ఈ అయిదేళ్లలో నియోజకవర్గాలను వీరిద్దరు పీల్చి పిప్పిచేసినంతగా మరెవరూ చేయలేదు. ఇసుక, మట్టి గ్రావెల్ దోపిడీలు, సెటిల్‌మెంట్లు, దందాలు, రౌడీయిజం, ప్రశ్నించే వారిపై కేసులు, దాడులతో ద్వారంపూడి, జగ్గిరెడ్డి చెలరేగిపోయారు. వీరిద్దరిదీ సీఎం సామాజికవర్గం కావడంతో తమకు ఎదురేలేదన్నట్టు వ్యవహరించారు. అయిదేళ్లలో వందల కోట్లు సంపాదించారు. ప్రజలకు ఏ చిన్నమేలు చేయకపోవడం ఒకెత్తయితే ప్రతి పనికి రేటుతో చెలరేగిపోయారు. వీటన్నింటితో విసుగెత్తిపోయిన ప్రజలు ఓటుతో చాచికొట్టారు. నియంతల్లా వ్యవహరిస్తున్న వీరిద్దరినీ ఓటుతో కసిదీరా కొట్టి టీడీపీ అభ్యర్థులకు అఖండ ఓట్ల మెజార్టీ కురిపించి తమ కోపం చల్లార్చుకున్నారు. జగ్గంపేటలో సైతం సిట్టింగ్ ఎమ్మెల్యే చంటిబాబు అవినీతికి హద్దుల్లేకుండా పోయింది. దీంతో ఇక్కడ కూడా ఆ పార్టీని నామరూపాల్లేకుండా జనం చీల్చిచెండాడేశారు. అదే రీతిన కురసాల కన్నబాబుకు గట్టి షాక్ ఇచ్చారు.

ఆ పాపమే పెను శాపమై..



- సెంట్రల్ జైలులో చంద్రబాబు
- అక్రమంగా 53 రోజులు బంధించిన జగన్
- ఆ క్షణం నుంచే ఓటరులో మౌన వేదన
- సమయం చూసి ఓట్లతో కొట్టారు

(రాజమహేంద్రవరం–ఆంధ్రజ్యోతి)

జగన్ చేసిన ఆ పాపాలే వైసీపీ పాలిట పెను శాపాలై వెంటాడి వేటాడాయి. ఆ పాపాలకు గత ఏడాది సెప్టెంబరు 10 పరాకాష్ట. రాష్ట్రానికి చీకటి రోజు. రాజకీయ కక్షతో రగిలిపోయిన జగన్.. చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించి రాజమండ్రి సెంట్రల్ జైలులోని స్నేహ బ్లాక్‌లో బంధించిన రోజు. ఆనాటి ప్రజల కన్నీరే ఓటు రూపంలో వైసీపీపై వేటు వేసింది. ప్రజాతీర్పులో వంచకులు కొట్టుకుపోక తప్పలేదు. చంద్రబాబును సీబీసీఐడీ అరెస్టు చేసిన క్షణం నుంచీ జనం కళ్లల్లో ఉబికివచ్చిన కన్నీరు ఇంకిపోయి కసిగా మారింది. చంద్రబాబు వయసు, రాజకీయ ప్రయాణం, సుదీర్ఘ అనుభవం, సంపదను సృష్టించే సామర్థ్యం.. ఏదీ వైసీపీ వారి కళ్లకు కనిపించలేదు. ఒకే లక్ష్యం.. చంద్రబాబును జైలుకు పంపడం. పైశాచిక ఆనందాన్ని పొందడం. అయితే, కాలం ఊరుకున్నా ఓటరు ఊరుకుంటాడా. సరిగ్గా 8 నెలల 2 రోజులు పంటి బిగువున అదిమిపట్టుకున్న అభిమానం అగ్నిపర్వతమై జగన్నాటకాన్ని దహించేసింది. చంద్రబాబు జైలులో ఉన్న రోజులు నిజంగా ఓ చరిత్ర. ఆయన భద్రతపై జనం ఎంత భయపడుతున్నా ఆ 'లీడర్' మాత్రం నిండుకుండలా ఒక్క క్షణం కూడా తొణికిసలాడలేదు. పైగా జైలు నుంచే ప్రజలకు ధైర్యం చెప్పారు. కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఖైదీలు సైతం ఆయనతో మాట్లాడడానికి ఎంతో ప్రయత్నించారు. తమ గోడు వెళ్లబోసుకోవడానికి చూశారు. కానీ అవకాశం దక్కలేదు. జైలు రోడ్డులో వెళ్లే వాళ్లలో ఆవేదన కనిపించేది. పది మంది గుమిగూడి, హడావుడి కనిపిస్తే.. 'బాబు బయటకు వస్తున్నారా' అనే ప్రశ్న వినిపించేది. చిన్న పనులు చేసేవాళ్ల దగ్గర నుంచి ఐటీ ఉద్యోగుల వరకూ విదేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి రాజమండ్రి వచ్చి జైలు గోడలవైపు దీనంగా చూస్తూ నిశ్శబ్దంగా ఆవేదన చెందేవారు. చంద్రబాబు సతీమణికి మనోధైర్యం చెప్పి బరువెక్కిన గుండెలతో వెనుదిరిగేవారు. నిర్మాణానికి తాను సీఎంగా ఉన్నప్పుడు నిధులు మంజూరు చేసిన 'స్నేహ బ్లాక్' 53 రోజులు మౌనంగా రోదించింది. ఇప్పుడు అక్రమార్కుల రాక కోసం ఎదురుచూస్తోంది నిశ్శబ్దంగా..

చీల్చి చెండాడేశారు!

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీడీపీ కూటమివైపు ప్రజలు అసాధారణ రీతితో మొగ్గుచూపారు. ఓటుతో వైసీపీని చీల్చిచెండాడారు. టీడీపీ, జనసేనకు ఈవీఎంల్లో ఓట్ల వరద కురిపించారు. ప్రభుత్వ ఉద్యోగులైతే ఫ్యాన్‌పై కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో వెల్లువలా కదిలారు. సైకిల్, గ్లాసుకు ఓట్లు గుద్దిపారేశారు. ఐదేళ్ల వైసీపీ అరాచకాలకు, వేధింపులకు విసిగివేసారి కూటమిని కాలరెగరేసేలా చేశారు.

- జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అన్ని వర్గాలు కూటమికే మొగ్గు
- ఉద్యోగులు, యువత, మహిళలు, రైతులు, వ్యాపారులు, వృద్ధులు ఏకపక్ష తీర్పు
- ఏడు సీట్లలో అసాధారణ మెజార్టీలతో టీడీపీ కూటమి విజయం
- పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కలతో విజేతలకు పెరిగిన ఆధిక్యత
- జిల్లాలో మొత్తం దాఖలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 18,740
- ఇందులో టీడీపీ, జనసేనకు 11,623: వైసీపీకి కేవలం 3,636
- కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్
- అవమానభారంతో ఇళ్లకే పరిమితమైన వైసీపీ అభ్యర్థులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అటు మహిళలు, వృద్ధులు, యువత, రైతులు, వ్యాపారులు ఒకరేంటి ప్రతివర్గం ఉద్యమ దండులా కదిలి ఓటుతో విస్పష్ట తీర్పు ఇచ్చారు. ఉద్యోగులైతే పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో 62.93శాతం మంది టీడీపీ కూటమికే ఓటేశారు. ఈవీఎం ఓట్లలో ఏడుగురు కూటమి అభ్యర్థుల్లో ఆరుగురికి లక్షకుపైనే ఓట్లు దాటిపోయాయి.మరోపక్క చరిత్ర ఎరుగని ఘోర పరాజయంతో జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల అడ్రస్‌లే లేవు.

పోస్టల్ లెక్క తేలడంతో ఆధిక్యాలు పెరిగిపోయాయి..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో చరిత్రలో మునుపెన్నడూ లేని భారీ మెజార్టీలు సాధించిన టీడీపీ, జనసేన అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో సరికొత్త ఓట్ల చరిత్ర సృష్టించారు. మంగళవారం జరిగిన ఈవీఎం ఓట్ల లెక్కింపుల్లో ఏడు నియోజకవర్గాల్లో విజయదుంధుబి మోగించిన ఐదుగురు టీడీపీ, ఇద్దరు జనసేన అభ్యర్థులకు సంబంధించిన మెజార్టీలు స్వల్పంగా పెరిగాయి. మంగళవారం రాత్రి నాటికి ఈవీఎం ఓట్ల లెక్కలు తేలగా, పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ఏ అభ్యర్థికి ఎన్ని దాఖలయ్యాయనేది బుధవారం ఉదయం నాటికి స్పష్టం వచ్చింది. దీంతో అందరి మెజార్టీలు పెరిగాయి. కాగా జిల్లాలో మొత్తం 18,470 మంది ప్రభుత్వఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు దాఖలు చేశారు. వీటిలో మొత్తం 11,623 ఓట్లు కూటమికే వచ్చాయి. అంటే పోలైన మొత్తం ఓట్లలో 62.93శాతం ఓట్లు టీడీపీ, జనసేనకే పడ్డాయి. వైసీపీ అభ్యర్థులకు కేవలం 3,636 ఓట్లే వచ్చాయి. ఈవీఎంల ఓట్లలోను జిల్లాలో ఆరుగురు టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఏకంగా లక్షకుమించిన ఓట్లు దాఖలయ్యాయి. వీరందరికీ ఆయా నియోజకవర్గాల్లో వచ్చిన మొత్తం ఓట్లు 60శాతానికిపైగా దాటిపోయాయి. అత్యధికంగా కాకినాడ రూరల్‌లో జనసేన అభ్యర్థి పంతం నానాజికి ఏకంగా 65.11 శాతం ఓట్లు వచ్చాయి. కాకినాడ సిటీ, పిఠాపురంలో 64శాతం వరకు వచ్చాయి. ఒకరకంగా ఇవన్నీ సరికొత్త రికార్డులే అని చెప్పాలి. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ వేవ్‌లో జిల్లాలో పెద్దాపురం మినహా అన్ని స్థానాల్లో వైసీపీ గెలిచింది. అంతవేవ్‌లో కూడా ఏ అభ్యర్థికి భారీ మెజార్టీలు రాలేదు. ప్రత్తిపాడులో అప్పట్లో ఎమ్మెల్యేగా నెగ్గిన పర్వత ప్రసాద్‌కు 4,666 మెజార్టీ వస్తే తాజా ఫలితాల్లో టీడీపీ ఎమ్మెల్యేగా నెగ్గిన వరుపుల సత్యప్రభకు 38,768 మెజార్టీ వచ్చింది. జగ్గంపేటలో అప్పట్లో వైసీపీకి 23,365 మెజార్టీ వస్తే ఇప్పుడు టీడీపీకి 52,676 మెజార్టీ లభించింది. పిఠాపురంలో అప్పట్లో వైసీపీకి 14,992 మెజార్టీ వస్తే జనసేననుంచి పవన్‌కళ్యాణ్‌కు 70,279 మెజార్టీ వచ్చింది. కాకినాడ సిటీలో వైసీపీకి అప్పట్లో 14,111 మెజార్టీ రాగా, ఇప్పుడు టీడీపీకి 56,572 మెజార్టీ వచ్చింది. కాకినాడ రూరల్‌లో వైసీపీకి అప్పట్లో 8,789 ఓట్ల మెజార్టీ రాగా, ఇప్పుడు జనసేనకు 72,040మెజార్టీ వచ్చింది. కాకినాడ ఎంపీ అభ్యర్థికి గత ఎన్నికల్లో 25,738 ఓట్లు మెజార్టీ రాగా, ఈ ఎన్నికల్లో జనసేన ఎంపీ అభ్యర్థికి ఏకంగా 2,29,491 మెజార్టీ లభించింది. కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌కు సైతం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 10,728 లభించాయి. వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమశెట్టి సునీల్‌కు 5,020 మాత్రమే వచ్చాయి.



తంగెళ్లకు క్రాస్ కొట్టేశారు..

కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థికి అసెంబ్లీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌తో ఓట్లు తగ్గాయి. ఎమ్మెల్యేలకు పడ్డ ఓట్లకు సమానంగా ఎంపీ అభ్యర్థికి ఓట్లు పడాల్సి ఉండగా వేలల్లో ఓట్లు క్రాస్ అయ్యాయి. కాకినాడ ఎంపీ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదుగురు టీడీపీ, ఇద్దరు జనసేన ఎమ్మెల్యే అభ్యర్థులకు మొత్తం ఈవీఎం ఓట్లు 7,89,685 పడ్డాయి. ఇంతే ఓట్లు జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌కు కూడా రావాల్సి ఉంది. కానీ ఎమ్మెల్యే అభ్యర్థులకు సమానంగా రాలేదు. తంగెళ్లకు ఏడు అసెంబ్లీల పరిధిలో మొత్తం 7,18,971 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో 70,714ఓట్లు తక్కువగా పడ్డాయి. అంటే టీడీపీ, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థులకు ఒక ఓటు వేసిన ప్రజలు, రెండో ఓటు జనసేన ఎంపీ అభ్యర్థికి వేయాల్సి ఉన్నా వేయలేదు. మొత్తం 70,714 ఓట్లు వేరే పార్టీ అభ్యర్థికి పోలయ్యాయి. ఇందులో మెజార్టీ ఓట్లు వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమశెట్టి సునీల్‌కు పోలయ్యాయి. తునిలో టీడీపీ అభ్యర్థి యనమల దివ్యకు 95,836 ఈవీఎం ఓట్లు రాగా, జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్లకు 87,028 ఓట్లు వచ్చాయి. ప్రత్తిపాడులో టీడీపీ అభ్యర్థికి 1,01,856 ఓట్లు రాగా, ఎంపీ అభ్యర్థికి 86,385 వచ్చాయి. జగ్గంపేటలో టీడీపీ అభ్యర్థికి 1,12,591ఓట్లు రాగా, ఎంపీ అభ్యర్థికి 1,00,121 వచ్చాయి. పిఠాపురంలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పవన్‌కు 1,32,725ఓట్లు రాగా, ఎంపీ అభ్యర్థికి 1,23,223 వచ్చాయి. పెద్దాపురంలో టీడీపీ అభ్యర్థికి 1,04,407 ఓట్లు వస్తే ఎంపీ అభ్యర్థికి 93,550 వచ్చాయి. కాకినాడ సిటీలో టీడీపీకి 1,11,068ఓట్లు వస్తే ఎంపీ అభ్యర్థికి 1,03,138 ఓట్లు పడ్డాయి. కాకినాడ రూరల్‌లో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థికి 1,31,202ఓట్లు రాగా, ఎంపీ అభ్యర్థికి 1,25,526 పడ్డాయి. ఇలా అన్ని నియోజకవర్గాలు కలిపితే ఎమ్మెల్యేల కంటే ఎంపీ అభ్యర్థికి 70,714ఓట్లు తక్కువగా దాఖలయ్యాయి. ఏడు అసెంబ్లీల్లో ఎమ్మెల్యే అభ్యర్థులకు మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 11,623 దాఖల య్యాయి. కానీ జనసేన ఎంపీ అభ్యర్థికి 10,728 మాత్రమే వచ్చాయి.

అడ్రస్‌లే లేవు..

దారుణ పరాజయం మూటగట్టుకున్న వైసీపీ అభ్యర్థులు ఎన్నికల ఫలితాల తర్వాత అవమానభారంతో ఇళ్లకే పరిమితమయ్యారు. ఎక్కడా ఏనేత అలికిడి కూడా లేదు. తాజా ఎన్నికల్లో జిల్లాలో ఎన్నో కొన్ని సీట్లు అయినా వస్తాయని వైసీపీ ఎమ్మెల్యేలు భావించారు. కాకినాడ సిటీలో ద్వారంపూడి కిక్కురుమనడం లేదు. ఐదేళ్లలో దౌర్జన్యాలు, సెటిల్‌మెంట్లతో చెలరేగిపోయిన తనకు మున్ముందు ఇబ్బందులు తప్పవనే భయంతో వణుకుతున్నారు. తుని నుంచి మంత్రి రాజా ఓటమిపాలవడంతో కార్యకర్తలకు సైతం ముఖం చాటేశారు. కాకినాడరూరల్ నుంచి వైసీపీ ఎమ్మెల్యే అయితే ఏకంగా పార్టీని కడిగిపారేశారు. ఇలా ఒక్కొక్కరు బయటకు వస్తుండగా, కొంద రు లోలోపలే అధినేత తీరు తో రగిలిపోతున్నారు. మరో పక్క తమ ఇళ్ల వద్ద, పార్టీ కార్యాలయాల వద్ద ఇంకా పోలీసులు పహారా కాస్తుం డడంతో ఏవైపు నుంచి ఎవరు దాడిచేస్తారోనన్న భయంతో వణికిపోతున్నారు. జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులైతే ఎవరూ బయటకు రాని పరిస్థితి నెలకొంది. ప్రత్తిపాడులో అయితే ఎమ్మెల్సీ అనంతబాబును నియోజకవర్గానికి తెచ్చి జగన్ తనను ముంచేశారని రగిలిపోతున్నారు.

సంబరాలే సంబరాలు..

కూటమి అధికారంలోకి రావడంతో జిల్లాలో టీడీపీ, జనసేన నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన నేతల ఇళ్లకు అభిమానులు, ప్రజలు పోటెత్తుతున్నారు. అభినందించడానికి క్యూలు కడుతున్నారు. దీంతో ఆయా నేతల ఇళ్ల వద్ద పండగ వాతావరణం నెలకొంటోంది. ఈనెల 9న ప్రధాని మోదీ, సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం నేపథ్యంలో మంత్రి పదవులపై కసరత్తు ప్రారంభమైంది. తమకు క్యాబినేట్‌లో చోటు దక్కుతుందేమోనన్న ఆశలతో కొందరున్నారు.

జిల్లాలో భారీవర్షం



పిఠాపురంలో వర్షం కురుస్తున్న దృశ్యం

కాకినాడసిటీ, జూన్ 5: జిల్లాలో బుధవారం భారీగా వాన కురిసింది. కాకినాడ నగరంలో సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సాయంత్రం నుంచి రాత్రివరకు వర్షం కురవడంతో రోడ్లు నీట మునిగాయి. కాకినాడ సినిమా రోడ్, మెయిన్‌రోడ్‌లతోపాటు మిగిలిన రోడ్లు మునగడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు ఇళ్లలోంచి బయటకు రావడానికి వీలు లేని విధంగా మారాయి. రాగంపేట, కామేశ్వరినగర్ ప్రాంతాల్లో డ్రైన్లలోని మురుగునీరు, వర్షపునీరు కలిసి రోడ్ల మీదకు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

వర్షపాతం వివరాలు

జిల్లాలో బుధవారం భారీవర్షం కురిసింది. అత్యధికంగా శంఖవరం మండలంలో 50.75 మీ.మీ. వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత స్థానంలో పెద్దాపురం మండలంలో 48.0 మీ.మీ. వర్షం కురిసింది. మండలాలవారీగా వర్షపాతం వివరాలు మీ.మీ.లలో.. కాకినాడ రూరల్ 24.0, ఏలేశ్వరం 14.25, ప్రత్తిపాడు 13.5, పెదపూడి 10.75, గొల్లప్రోలు 7.75, యు కొత్తపల్లి 6.0, పిఠాపురం 5.25, కిర్లంపూడి 4.75, కాకినాడ అర్బన్ 4.5 మీ.మీ. వర్షం కురిసింది.

ఎన్నికలు విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 5: జిల్లాలో సాధారణ ఎన్నికలు 2024లో తొలి నుంచి చివర వరకు భాగస్వామ్యమైన ప్రతిఒక్కరికీ కలెక్టర్ జె.నివాస్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో సాధారణ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ అంతా అందరి సహకారంతో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేశామన్నారు. మే 13న జరిగిన పోలింగ్ ప్రక్రియ, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న రిటర్నింగ్ అధికారులు, ఇతర సిబ్బంది ఎంతో అంకితభావం, నిబద్ధతతో వ్యవహరిస్తూ విధులు సక్రమంగా నిర్వహించారన్నారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. రాజకీయ పక్షాల ప్రతినిధులకు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌తోపాటు ఈసీఐ నూతనంగా ప్రవేశపెట్టిన హోం ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యమైన బృందాలకు, అన్నివిధాలా సహకరించిన ప్రజలకు, రెవెన్యూ, నోడల్ అధికారులకు, ఏఆర్వోలు, సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లలకు, నిఘాస్క్వాడ్‌లు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లకు అభినందనలు తెలియజేశారు.

ఈవీఎంలను సక్రమంగా భద్రపరచాలని ఆదేశించిన కలెక్టర్

సాధారణ ఎన్నికలు 2024 నిర్వహణలో భాగంగా వినియోగించిన ఈవీఎం, వీవీప్యాట్స్ ఇతర ఎన్నికల సామాగ్రిని సక్రమంగా భద్రపరచాలని కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ జిల్లాలో సక్రమంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తికావడంతో అధికారులు ఎన్నికల సామాగ్రిని భద్రపరిచే ప్రక్రియ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జేఎన్‌టీయూలో ఉన్న ఈవీఎంలు కలెక్టరేట్ పక్కన ఉన్న ఈవీఎంల గోదాంలో భద్రపరుస్తున్నామన్నారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విజేతలు

ప్రథమ బహుమతి: రూ.10వేలు
పి. సూర్యకుమారి
మురమండ, కడియం మండలం, తూర్పుగోదావరి జిల్లా.

ద్వితీయ బహుమతి: రూ.5వేలు
1. చిక్కాల భాస్కరరావు
మోరి, సఖినేటిపల్లి మండలం, కోనసీమ జిల్లా.
2. ఎస్. సత్యరామారావు
ఇంజరం, తాళ్ళరేవు మండలం, కాకినాడ జిల్లా.
3. అలజంగి నాగరాజు, రామచంద్రపురం.

మళ్లీ ఇన్నాళ్లకు..

రంపచోడవరంలో 15 ఏళ్ల తర్వాత టీడీపీ విజయం



శిరీషాదేవి

(రంపచోడవరం):తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఏజెన్సీ కంచుకోటగా ఉంది. అయితే రంపచోడవరంలో గత మూడు దఫాలుగా చవిచూసిన వైఫల్యాలను దాటి ఈ ఎన్నికల్లో ఊహించని రీతిలో తెలుగుదేశం పార్టీ మళ్లీ ఇక్కడ పాగా వేసింది. 1983లో దివంగత ఎన్టీ రామారావు సారథ్యంలో మన్యం ఓటర్లు తెలుగుదేశానికి పట్టం కట్టి 2004 వరకూ ఆరు సార్లు వరుస విజయాలను కట్టబెట్టారు. లోపం ఎవరిదైనప్పటికీ 2009లో ప్రారంభమైన వైఫల్యం 2019 వరకూ మూడు దఫాలుగా వరుసగా ఆ పార్టీని వెంటాడింది. ఓడిన ప్రతిసారీ అధిష్ఠానం ముఖ్యంగా అధినేత చంద్రబాబు సైతం ఎన్నో మార్పులను చేసినా ఫలితం రాలేదు. అయితే ఈ సారి మాత్రం 1983 మాదిరి ప్రభంజనంగా రాష్ట్ర వ్యాప్తంగా సునామీలా పార్టీ విజయకేతనం ఎగురవేయడంతో రంపచోడవరం కూడా దేశం ఖాతాలోకి తిరిగి వచ్చేసింది. 2009 ఎన్నికల్లో ఇక్కడ తొలిసారిగా తెలుగుదేశం ఓడిపోగా, 2014, 2019లలో కూడా అదే ఓటమి. 2019లో అయితే ఆ ఓటమి 39 వేల పైచిలుకు మెజారిటీతో ప్రత్యర్థి పార్టీకి విజయాన్ని తెచ్చిపెట్టింది. 2024 ఎన్నికల్లో పార్టీ దశ తిరిగింది. ఓటర్లు టీడీపీ వైపు ఆకర్షితులయ్యారు. మొత్తం 2,10,508 ఓట్లు నమోదు కాగా, టీడీపీ అభ్యర్థికి 90087 ఓట్లు వచ్చాయి. వైసీపీకి 80948 ఓట్లు వచ్చాయి. సీపీఎంకు అనూహ్యంగా 21265 ఓట్లు వచ్చాయి. మొత్తంగా టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీషాదేవి తన సమీప ప్రత్యర్థి నాగులాపల్లి ధనలక్ష్మిపై 9139 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

52 ఏళ్ల తర్వాత ఆ కుటుంబానికి ఎమ్మెల్యే గిరీ



ప్రత్తిపాడు, జూన్ 5: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన వరుపుల జోగిరాజు కుటుంబానికి మళ్లీ 52 ఏళ్ల తర్వాత ఎమ్మెల్యే పదవి వరించింది. 1972 ప్రత్తిపాడు అసెంబ్లీ ఎన్నికల్లో వరుపుల జోగిరాజు కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి ప్రత్యర్థి అయిన ఇండిపెండెంట్ అభ్యర్థి ముద్రగడ వీరరాఘవరావుపై విజయం సాధించారు. అనంతరం నాలుగున్నర దశాబ్దాల వరకు వరుపుల జోగిరాజు కుటుంబం నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేయలేదు. అయితే గత ఎన్నికల్లో దివంగత వరుపుల జోగిరాజు మనవడు వరుపుల రాజా టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి 4616 ఓట్ల తేడాతో ఓడిపోయారు. వరుపుల రాజా వారసురాలుగా ఆయన భార్య వరుపుల సత్యప్రభ ప్రస్తుత ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల బరిలో టీడీపీ ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచి ప్రత్యర్థి అయిన వైసీపీ అభ్యర్థి తాత వరుపుల సుబ్బారావుపై 38768 ఓట్ల మెజార్టీ తో విజయం సాధించారు. వరుపుల జోగిరాజు ఎమ్మెల్యే పదవి చేపట్టిన 52 ఏళ్ల తర్వాత ఆయన మనవడు భార్య సత్యప్రభ భారీ మెజార్టీతో కూటమి అభ్యర్థిగా విజయం సాధించడంతో మళ్లీ జోగిరాజు కుటుంబానికి రెండో సారి ఎమ్మెల్యే పదవి లభించింది.

అంగన్‌వాడీ కేంద్రం నుంచి అసెంబ్లీకి



సహచర సిబ్బందితో ఎమ్మెల్యే విజేత శిరీషాదేవి(సర్కిల్‌లో)

రాజకీయాల్లోకి వచ్చిన ఐదు నెలల్లోనే రంప ఎమ్మెల్యేగా గెలుపొందిన శిరీషాదేవి

(రంపచోడవరం): ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రాణించేందుకు మంచి విద్యార్హతలు ఉండి కూడా ఉన్న ఊరికే సేవ చేసే లక్ష్యంతో అంగన్వాడీ కార్యకర్తగా చిరు ఉద్యోగంలో చేరిన ఆమె ఊహించని రీతిలో రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఐదు నెలలకే రంపచోడవరం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు మిరియాల శిరీషాదేవి.. ఈ ఎన్నికల్లో రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి ఎన్నిక కావడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆమె పరిచయమయ్యారు.. బీఎస్సీ, బీఈడీ చేసిన ఆమె ఉపాధ్యాయ పోస్టుకు అర్హతలు అన్నీ ఉన్నా, తన గ్రామంలోనే ఉండి సేవ చేయడం కోసం అంగన్వాడీ ఉద్యోగాన్ని ఎంచుకున్నారు. ఉమ్మడి కుటుంబంగా అత్తవారి ఇంట ఉన్న ఆమెకు తన భర్త విజయభాస్కర్ తెలుగుదేశం పార్టీలో యువజన విభాగానికి నాయకుడు కావడంతో, 2024 ప్రారంభంలో రాజకీయాల్లోకి వచ్చి రంపచోడవరం అభ్యర్థిత్వం కోసం తెలుగుదేశం పార్టీకి దరఖాస్తు చేసుకున్నారు. ఎందరో సీనియర్లతో పోటీ పడిన ఆమె మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ప్రోత్సాహంతో రంపచోడవరం టీడీపీ అభ్యర్థిత్వాన్ని పొందడంతో పాటు విజయాన్ని కూడా కైవశం చేసుకున్నారు.

యనమల ఇంట పదవుల పంట



యనమల దివ్య



రామకృష్ణుడు



పుట్టా మహేష్



పుట్టా సుధాకర్

తొండంగి,జూన్ 5: టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఇంట ఈసారి పదవుల పంట పండింది. ఆయన పెద్ద కుమార్తె యనమల దివ్య తుని నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. ఆయన రెండో అల్లుడు పుట్టా మహేష్ ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేసి పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు. యనమల వియ్యంకుడు మాజీ టీటీడీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం నుంచి శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. యనమల శాసన మండలి ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్నారు. యనమల ఇంట పదవుల పంట పండడంపై కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సత్యదేవుని సన్నిధిలో ఎమ్మెల్యే విజేతల పూజలు



ఆశీర్వచనం అందుకుంటున్న జ్యోతుల నెహ్రూ కుటుంబం



స్వామివారిని దర్శించుకున్న యనమల దివ్య

అన్నవరం, జూన్ 5: రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుడి సన్నిధిలో నూతన ఎమ్మెల్యేలుగా గెలుపొందిన జ్యోతుల నెహ్రూ, యనమల దివ్య వేర్వేరుగా బుధవారం స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేసి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. జ్యోతుల నెహ్రూ వెంట దేవస్థానం మాజీ ట్రస్టీ కొత్త కొండబాబు, రిటైర్డ్ పీఆర్వో తులా రాముడు తదితరులుండగా, యనమల దివ్య వెంట దేవస్థానం పూర్వపు ట్రస్టీ యనమల రాజేష్ తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి కార్యాలయంలో 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' డ్రా



రాజమహేంద్రవరం ఆంధ్రజ్యోతి యూనిట్‌లో డ్రా నిర్వహిస్తున్న దృశ్యం

విజేతలు వీరే

ప్రథమ బహుమతి: రూ.10 వేలు
పి.సూర్యకుమారి, మురమండ, కడియం మండలం, తూర్పుగోదావరి జిల్లా

ద్వితీయ బహుమతులు
ముగ్గురికి: రూ.5వేలు
1. చిక్కాల భాస్కరరావు, మోరి, సఖినేటిపల్లి మండలం, కోనసీమ జిల్లా.
2. ఎస్.సత్యరామారావు, ఇంజరం, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా.
3. అలజంగి నాగరాజు, రామచంద్రపురం

రాజమహేంద్రవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పేరిట ఆంధ్రజ్యోతి నిర్వహించిన సర్వేకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 19 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏ పార్టీ గెలుస్తుందో అంచనాలు చెప్పాలంటూ జిల్లా ఎడిషన్లలో ఆరు కూపన్లు ప్రచురించింది. సుమారు వెయ్యి మందికిపైగా ఫలానా పార్టీ గెలుస్తుందంటూ పూర్తి చేసిన కూపన్లను రాజమహేంద్రవరంలోని 'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయానికి పంపించారు. మొత్తం 19 స్థానాల్లోనూ కూటమే విజయం సాధిస్తుందని సుమారు 200 మంది కచ్చితమైన అంచనాలను రాసి పంపారు. బుధవారం సాయంత్రం ఈ ఎంపిక చేసిన కూపన్ల నుంచి డ్రా తీసి నలుగురిని విజేతలుగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజరు ఎస్.శ్రీనివాసరావు, ఎడిషన్ ఇన్చార్జి బీహెచ్‌వీ మంగేష్, యాడ్స్ మేనేజరు సీహెచ్ కృష్ణారావు, సర్క్యులేషన్ మేనేజరు బి.గోపాలకృష్ణ, ప్రొడక్షన్ మేనేజరు రాజేంద్ర, సిస్టమ్స్ ఇన్‌చార్జి ఎన్.శివకుమార్, తూర్పుగోదావరి జిల్లా రిపోర్టింగ్ ఇన్‌చార్జి ఎన్ఎస్ఎన్ సత్యనారాయణ, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురం, జూన్ 5: పిఠాపురం ఎమ్మెల్యే విజేత, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ ఎన్ వర్మ కలిశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో పవన్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పవన్ మాట్లాడుతూ తన వెన్నంటి ఉండి జనసేన విజయం కోసం, తన విజయం కోసం కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే వర్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వర్మను వేదికపైకి పిలిచి ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. వర్మ పవన్‌ను సత్కరించి అన్నవరం ప్రసాదం అందజేశారు. పవన్ మాట్లాడుతూ వర్మను గుండెల్లో పెట్టి చూసుకుంటానన్నారు. తన గెలుపులో వర్మ కీలకపాత్ర పోషించారని తెలిపారు. టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలకు పవన్ ధన్యవాదాలు తెలిపారు.

10లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలి

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 5: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను తప్పనిసరిగా దగ్గరలో ప్రభుత్వ ఐటీఐలు కాకినాడ, జగ్గంపేట, అమలాపురం జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌ల్లో ఈనెల 10వతేదీ లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, డిస్ట్రిక్ట్ కన్వీనర్ ఎంవీజీ వర్మ తెలిపారు. ఇప్పటివరకు 1284 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోగా వారిలో 583 మంది విద్యార్థులు మాత్రమే వెరిఫికేషన్ చేయించుకున్నారన్నారు.

జూలై 20న ఆర్యాపురం కోఆపరేటివ్ పాలకవర్గం ఎన్నికలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 : రాజమహేంద్రవరంలోని ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నెం 3127 పాలకవర్గం ఎన్నికలు జూలై 20న జరిపేందుకు నిర్ణయిస్తూ జిల్లా కలెక్టర్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారని ఎన్నికల అధికారి, కొవ్వూరు డివిజనల్ సహకార అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నామినేషన్ల స్వీకరణ జూలై 11 నుంచి ఉంటుందని, ఉపసంహరణ 13న, ఎన్నికలు 20న నిర్వహించడానికి ఆదేశించారని తెలిపారు. అర్హత గల ఓటరు జాబితాను తయారు చేయడానికి ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూలై 4న తుది జాబితాను ప్రకటించుటకు కార్యాచరణ చేపడుతున్నట్లు ఎన్నికల అధికారి కృష్ణకాంత్ తెలిపారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



దేవి(ఫైల్)

రౌతులపూడి, జూన్ 5: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన ఏలూరి దేవి (30) పిడుగు పడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భర్త నారాయణతో కలిసి కట్టెల కోసం గ్రామ శివారు ఉన్న కొండ వద్దకు వెళ్లింది. కట్టెలు తెస్తున్న సమయంలో ఉరుములతో కూడిన వర్షం పడింది. వర్షం వస్తున్న సమయంలో దేవిపై పిడుగు పడడంతో మృతి చెందింది. దేవికి పాప, బాబు ఉన్నారు.

'రోజాకు సారె, చీర పంపిస్తున్నాం'



రోజాకు బహుమతిగా పంపనున్న సారె,చీర, స్వీట్లను చూపుతున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, జూన్ 5: వైసీపీ ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలతో విసిగి వేసారిన ప్రజలు చంద్రబాబు ఆధ్వర్యంలోని టీడీపీ కూటమికి అద్భుతమైన విజయాన్ని అందించారని కాకినాడ రూరల్ నియోజకవర్గం కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబి) అన్నారు. బుధవారం 47వ డివిజన్ కరణంగారి సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం కోసం లోకేశ్‌పై వైసీపీ నాయకులు అవహేళన చేసి మాట్లాడారని, చరిత్రలో ఎవరికీ రాని మెజారిటీ మంగళగిరిలో లోకేశ్‌కు వచ్చిందన్నారు. లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనిల్‌కుమార్ యాదవ్, రోజా తదితర మాజీ మంత్రులు ఎన్నికల్లో గాల్లో కొట్టుకుపోయారన్నారు. రోజాకి రాజకీయ భిక్ష పెట్టింది టీడీపీ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ సమయంలో రోజా బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారన్నారు. చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారంతా పత్తాలేకుండా పోయారన్నారు. ఓటమిపాలైన రోజా అత్తారింట్లో కాపురం చేసుకునేందుకు టీడీపీ మహిళలు సిద్ధం చేసిన సారె, చీరలు, స్వీట్లను బహుమతిగా పంపుతున్నట్లు తెలిపారు. ఈ బహుమతులు స్వీకరించాలని కాకినాడ కాజా కూడా పంపుతున్నామన్నారు. త్వరలో అన్ని జిల్లాల నుంచి పార్సిల్స్‌లను పంపించనున్నట్లు చెప్పారు. కూటమి ఎమ్మెల్యేగా పంతం నానాజీ, ఎంపీగా ఉదయ శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిండమే కాకుండా టీడీపీ కూటమికి పట్టం కట్టిన ప్రజలు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ మాజీ ఎంపీపీ జి.శ్రీనివాసరావు, కాకరపల్లి చలపతిరావు, కొజు నెహ్రూ, దేవు వెంకన్న, కొల్లాబత్తుల అప్పారావు, వేటుకూరి నాగమణి, కంచుమర్తి లావణ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులకు ఉత్తమ మార్కులు

కాకినాడ రూరల్, జూన్ 5: నీట్ 2024 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆదిత్య కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. వి.సృజన్ 720 మార్కులకు గాను 715 మార్కులతో అఖిలభారత ఓపెన్ కేటగిరీలో 115వ ర్యాంకును సాధించారన్నారు. అదే విధంగా ఎస్‌హెచ్‌డీ శ్రావణ సత్యరవికిరణ్ 710 మార్కులతో 411వ ర్యాంకును, ఎం.విశ్వత్ 705 మార్కులతో 104వ ర్యాంకును, ఎం.నైమితరాణి 382వ ర్యాంకులను పొందినట్లు తెలిపారు. అంతే కాకుండా ఆర్ఎంఎస్ఎస్ రామగోపాల్ 695, కేఎస్‌బీ సుందరి 695, డి.ప్రహతిక 690, ఐఎల్ఎస్ సత్యాషిణి 690 మార్కులు సాధించారన్నారు. 19 మంది విద్యార్థులు 650పైనా 36 మంది విద్యార్థులు, 600పైనా 72 మంది విద్యార్థులు, 550పైనా సాధించి ఒకే క్యాంపస్ నుంచి 100 మెడికల్ సీట్లతో విజయం సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వారికి శిక్షణనిచ్చిన అధ్యాపక వర్గాన్ని ఆదిత్య చైర్మన్ ఎస్.శేషారెడ్డి, దీపక్‌రెడ్డి, లక్ష్మీరాజ్యం తదితరులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



జీజీహెచ్ (కాకినాడ) జూన్ 5 పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యవంతమైన మానవ మనుగడ సాధ్యమని కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ.విష్ణువర్ధన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైస్ ప్రిన్సిపాళ్లు డా.విష్ణువర్ధన్, డా.దేవీమాధవి ఆధ్వర్యంలో బుధవారం ఆర్ఎంసీ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డా. విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఎక్కడికక్కడ చెట్ల నరికివేత ద్వారా కాలుష్యం అధికమై ఆ ప్రభావం మానవ మనుగడపై పడుతుందన్నారు. ముఖ్యంగా నిరుపయోగంగా మారి నిస్సారమవుతున్న నేలను ఆధునిక సాంకేతికత, నూతన మెలకువల ద్వారా ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి భూమిని సారవంతం చేసి సాధ్యమైనంత ఎక్కువ ఆక్సిజన్‌ను విడుదల చేసే మొక్కలను నాటడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం పర్యావరణానికి సంబంధించి ఉత్తమ పోస్టర్ ప్రజెంటేషన్ చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలో 30 మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి డా.శశి, కమ్యూనిటీ మెడిసన్ విభాగాధిపతి డా.సుజాత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.సౌమ్య పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న కారు

ఇద్దరికి గాయాలు





క్షతగాత్రులు

పిఠాపురం, జూన్ 5: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం విరవాడ శివారులోని కూడలి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని కోలంక గ్రామం నుంచి తల్లికుమారులు మోటార్‌సైకిల్‌పై పిఠాపురం వెళుతున్నారు. అదే సమయంలో పిఠాపురం నుంచి దివిలి వెళ్తున్న కారు వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తల్లీకొడుకులకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరి విత్తనాలు పంపిణీ



రంగంపేటలో రైతులకు విత్తనాలు సరఫరా చేస్తున్న వెంకట నరసింహారావు

రంగంపేట/దివాన్‌చెరువు, జూన్ 5 : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, ఎస్.హైమ జ్యోతిలు బుధవారం రంగంపేట మండలంలో గల అభ్యుదయ రైతులకు రంగంపేటలో నూతన వరి రకాలను పరిశోధన నిమిత్తం పంపిణీ చేశారని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన వరి రకాలైన ఎంటీయూ 1271, 1275, 1310, బీపీటీ, 2858, 2841 వంటి రకాలను ప్రస్తుత సార్వాలో రైతుల కమతాలలో పరీక్షచేసి వాటి గుణగణాలను పోలిన రకాలు, ఎప్పటి నుంచో రైతులు వాడుతున్న ఎంటీయూ 7029, బీపీటీ 5204 వంటి రకాలతో పోల్చి ఫలితాలను విశ్లేషించి, సిఫార్స్ చేస్తామన్నారు. అంతేకాక బీపీటీ 2841 వంటి నల్ల బియ్యం రకాలను, పోషక విలువలు కలిగిన రకాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రవేత్తలు చేస్తున్న కృషికి వ్యవసాయశాఖ అధికారులు, రైతులు వారిని అభినందించారు. అనంతరం శాస్త్రవేత్తలు నారుమడి యాజమాన్యం, విత్తనశుద్ధి గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి కె.శ్రీనివాస్, వి.మహేష్, రైతులు పోతుల పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో రాజధాని నిర్మాణం తథ్యం


అమలాపురం ఎంపీ విజేత గంటి హరీష్‌మాధుర్



మాట్లాడుతున్న అమలాపురం పార్లమెంట్ విజేత గంటి హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, జూన్ 5: అమరావతిలో రాజధాని నిర్మాణం పూర్తిచేసి తీరతామని అమలాపురం ఎంపీ విజేత గంటి హరీష్‌మాధుర్ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు చరిత్రనే తిరగరాసిందన్నారు. ఇది ప్రజా విజయమన్నారు. నిజమైన అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకునే రాష్ట్ర ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి కూటమి అభ్యర్థులను గెలిపించుకున్నారన్నారు. ఎంపీగా ఎన్నికైన అనంతరం బుధవారం అమలాపురంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్ద తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, అరకొర సంక్షేమంతో పాటు జగన్ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. సంక్షేమం పేరుతో డోపిడీ పాలన సాగించిందన్నారు. 2014-19లో జరిగిన అభివృద్ధి మాత్రమే నేడు కనిపిస్తోందని, వైసీపీలో అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. ఎన్డీయేతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని గుర్తించి ప్రజలు ఓట్లు వేశారని, వారి నమ్మకాన్ని నిలబెడతామన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతానన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తన పుట్టినరోజు నాడు టిక్కెట్టు ఇవ్వగా ఆయనకు రిటర్న్ గిఫ్ట్‌గా ఏడు నియోజకవర్గాల అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించి ఇస్తానన్న మాటను ప్రజలు నిలబెట్టారన్నారు. కోనసీమ రైల్వే లైన్ నిర్మాణాన్ని ఐదేళ్లలో పూర్తి చేయడంతో పాటు పారదర్శక పాలన సాగిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ఓఎన్జీసీ, వేదాంత, గెయిల్ వంటి చమురు సంస్థలతో చర్చిస్తానన్నారు. లంక గ్రామాల ప్రజలు కనీసం మౌలిక వసతులు లేని పరిస్థితుల్లో ఉన్నారని, వారు నివసిస్తున్న ప్రాంతాల్లో రోడ్లు, వంతెనల నిర్మాణంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారిస్తామన్నారు. కోనసీమలో కోకోనట్ బోర్డు ఏర్పాటు, టూరిజం అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు. ఎన్డీయేలో మంత్రి పదవి వచ్చే అవకాశం ఉందా అని విలేకరులు ప్రశ్నించగా టీడీపీ అధినేత తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని హరీష్‌మాధుర్ సమాధానమిచ్చారు. మెట్ల రమణబాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రైతులు, విద్యార్థులు, యువత, భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సైకో పరిపాలనకు రాష్ట్ర ప్రజలు సరైన తీర్పు ఇచ్చారన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు యాళ్ల నాగసతీష్, చిక్కాల గణేష్, నాయకులు నల్లా శ్రీధర్, యేడిద శ్రీను, బొర్రా ఈశ్వరరావు, ఆశెట్టి ఆదిబాబు, నల్లా స్వామి, తిక్కిరెడ్డి నేతాజీ, మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ, బాస్కర్ల రామకృష్ణ, వలవల శివరావు, గంధం శ్రీను పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొని వ్యక్తి మృతి



ఎటపాక,జూన్ 5: ప్రమాదవశాత్తు అదుపుతప్పి ద్విచక్ర వాహనం, ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై రాంగోపాలపురం గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జేర్నపాల్ సమీపంలోని పూసుగూడెం గ్రామానికి చెందిన మడివి భీమా(35) ఓ పని నిమిత్తం భద్రాచలం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో రాంగోపాలపురం వద్ద కుంట నుంచి విజయవాడ వైపు వెళ్తున్న భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుని ఎదురుగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భీమా తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు, రేపు ఆర్టీసీ బస్ పాసుల జారీ ఉండదు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 5 : రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలోని బస్ పాసుల జారీ కౌంటర్ సాఫ్ట్‌వేర్ నవీకరణ జరుగుతున్న కారణంగా ఈనెల 6, 7 తేదీల్లో (గురు, శుక్రవారాలు) బస్‌పాసుల జారీ ఉండదని డిపో మేనేజర్ షేక్ షబ్బం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 8వ తేదీన కౌంటర్ యథావిధిగా పనిచేస్తుందని, విద్యార్థులు, మంత్లీ సీజన్ టిక్కెట్లు తీసుకునేవారు, ప్రత్యేక ప్రతిభావంతులు తదితరులంతా సహకరించాలని కోరారు.

నేడు, రేపు బస్‌పాస్ కౌంటర్లు మూత

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 5: ఏపీఎస్ఆర్టీసీ సంస్థలో విద్యార్థుల బస్‌పాస్‌లు, సీజన్ టిక్కెట్లు ఇచ్చే కొత్త సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేస్తున్న కారణంగా ఈనెల 6,7 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్లు మూసివేస్తున్నామని డిపో మేనేజర్ ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈనెల 8వ తేదీ నుంచి యథావిధిగా స్టూడెంట్ బస్‌పాస్‌లు, సీజన్ టిక్కెట్లు, పీహెచ్‌సీ పాస్‌లు ఇస్తామన్నారు.

జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం

» చల్లబడిన వాతావరణం » సేదతీరిన ప్రజానీకం


ప్రత్తిపాడులో కురుస్తున్న వర్షం, కొత్తపల్లిలో వీస్తున్న ఈదురుగాలులు

పిఠాపురం/గొల్లప్రోలు, జూన్ 5: పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు మండలాల పరిధిలోని గ్రామాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికం కావడంతో పాటు ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రీష్మతాపంతో విలవిలలాడారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత వాతావరణంలో మార్పు వచ్చింది. ఆకాశం మేఘావృతమయి వర్షం పడింది. గొల్లప్రోలులో ఏకధాటిగా కురిసిన వర్షంతో రహదారులు జలమయ్యాయి. పిఠాపురం, గొల్లప్రోలుల్లో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. దీనితో ప్రజలు సేదతీరారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు కురిసాయి. సాయంత్రం 4గంటల వరకు ఎండ సుర్రుమనిపించింది. ఒక్కసారిగా ఆకాశంలో దట్టమైన మబ్బులు ఆవరించాయి. ఉరుములు, మెరుపులు,పిడుగులతో చిరుజల్లులు పడ్డాయి. చిరుజల్లుల రాకతో ప్రజలు సేదతీరారు.

సామర్లకోట: సామర్లకోట పట్టణంలోనూ, మండలంలోనూ బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచీ ఎండ వేడిమి, ఉక్కబోత వాతావరణంతో సతమతమైన ప్రజానీకం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి చల్లదనంతో ఉపశమనం పొందారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు ముంపును ఎదుర్కొన్నాయి. వర్షాలతో ఖరీఫ్ వరి సాగుకు సిద్ధం అయ్యేందుకు, సాగుపనులు చేసేందుకు రైతులు సమాయత్తం అయ్యారు.

తుని రూరల్: మెట్టలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం గంటసేపు ఎడతెరిపిలేకుండా కురిసింది. దీంతో రోడ్లు జలమయంయ్యాయి. ఈ వర్షం సాగుకు అనుకూలంగా మారడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కిర్లంపూడి: కిర్లంపూడిలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులపై నీరు నిలిచిపోయింది. వాహన రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు.

గండేపల్లి: మండల వ్యాప్తంగా బుధవారం ఉరుములుతో కూడి భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై సుమారు గంట పాటు వర్షం పడింది. నారుమళ్లు వేసుకునేందుకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో బుధవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని రహదారులు, పల్లపు ప్రదేశాలు వర్షం నీటితో చిత్తడిచిత్తడిగా మారాయి.

రౌతులపూడి: మండల గ్రామాల్లో ఉరుములు, ఈదులుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో నీరు పోయే మార్గం లేక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఏలేశ్వరం: పగలంతా విపరీతమైన ఉష్ణతాపంతో మండలంలో తదితర ప్రాంతాల ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై చల్లని ఈదురు గాలులు వీచి కుండపోత వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

కూటమికి పట్టం కట్టిన ప్రజలకు కృతజ్ఞతలు : యనమల


మీడియాతో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్, జూన్ 5: కూటమికి పట్టం కట్టిన రాష్ట్ర ప్రజలకు శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజాతీర్పుతో కూటమి చరిత్ర సృష్టించిందని మండలంలోని తేటగుంట టీడీపీ కార్యాలయంలో యనమల రామకృష్ణుడు మీడియాకు వెల్లడించారు. ప్రజలు తీర్పుతో టీడీపీ తునిలో మరోసారి చరిత్ర సృష్టించిందన్నారు. తుని పట్టణం, కోటనందూరు, తొండంగి మండలాల్లో టీడీపీ మెజార్టీ కైవసం చేసుకుందన్నారు. 1883లో టీడీపీని ప్రజలు ఆదరించారని, గత చరిత్ర మళ్లీ ఇప్పుడు రిపీట్ అవ్వడం అభినందనీయమన్నారు. రెండుసార్లు అధికారానికి దూరం అవడానికి పలు కారణాలు ఉన్నప్పటికీ మళ్లీ టీడీపీకి తుని ప్రజలు పట్టం కట్టారన్నారు. రాష్ట్రంలో జగన్ తుగ్లక్ పాలనలో ప్రజలు విసుగుచెందారని, అందుకే తగిన గుణపాఠం చెప్పారన్నారు. 151 సీట్లు ప్రజలు ఇస్తే ముఖ్యమంత్రిగా జగన్ పాలన చేయలేకపోయారన్నారు. రాష్ట్రాభివృద్ధిని పూర్తిగా విస్మరించారని యనమల విమర్శించారు. సమావేశంలో తుని ఎమ్మెల్యేగా గెలిచిన యనమల దివ్య, టీడీపీ యువ నేత యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి సత్యనారాయణ, నార్ల రత్నాజీ తదితరులు ఉన్నారు. టీడీపీ కూటమి భారీ విజయాన్ని పురస్కరించుకుని కార్యకర్తలు పెద్ద ఎత్తున యనమల రామకృష్ణుడు స్వగృహానికి తరలివచ్చారు. యనమలను కలిసిన వారిలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జిల్లాకు చెందిన పలువురు కీలక నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

అంకితభావంతో అందించిన సేవలతో గుర్తింపు : ఎస్పీ

కాకినాడ క్రైం జూన్ 5: విధి నిర్వహణలో పారదర్శకత, అంకితభావంతో అందించిన సేవలు గుర్తింపునిస్తాయని జిల్లా ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో జిల్లా పరిపాలనాధికారి హోదాలో అలాగే స్పెషల్ బ్రాంచ్, ఐటి కోర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన మంతెన శివరామరాజు, పి.శ్రీనివాస్‌రావ్ ఉద్యోగ విరమణ... అలాగే ట్రైనింగ్ డీఎస్పీ కె.ప్రమోద్ బదిలీ అయిన సందర్భంగా ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి ఎస్పీ శాలువాలు కప్పి సన్మానించి సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగంలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని విధి నిర్వహణలో అధికారులను మెప్పించడం ఆషామాషీ విషయం కాదన్నారు. సుమారు 37 ఏళ్లకు పైగా పోలీస్ ఉద్యోగంలో అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో ఛాలెంజ్‌లను అధిగమించడం ద్వారా సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. ఈ విశ్రాంత అధికారుల శేష జీవితం వారి కుటుంబాలతో ఆనందమయం కావాలని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజెవి భాస్కరావ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, సెబ్ అడిషనల్ ఎస్పీ కె.శ్రీలక్ష్మి, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

ఘనంగా మదుగులమ్మ జాతర

సామర్లకోట, జూన్ 5: సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామ దేవతగా ప్రసిద్ధి పొందిన మదుగులమ్మ అమ్మవారి జాతర ఉత్సవం బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. గ్రామ ఉత్సవ కమిటీ నాయకులు చల్లా బుజ్జి తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతరలో ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ హాజరై అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గ్రామ పురవీధుల మీదుగా అమ్మవారి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు.

నేరేళ్లమ్మ తల్లి జాతర మహోత్సవాలు

కాకినాడ రూరల్, జూన్ 5: రూరల్ మండలం ఇంద్రపాలెం గ్రామ దేవత నేరేళ్లమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం జాతరను నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం తీర్థం జరుగుతుందని, చుట్టు ప్రక్కల గ్రామాల్లోని భక్తులంతా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈనెల 14న అన్నదానం నిర్వహించనున్నట్టు తెలిపారు.

దుర్గాడలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, జూన్ 5: దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి కి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాసశివ రాత్రి సందర్భంగా స్వామికి మహన్యాస పారాయణ చేసి ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పళ్లరసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి స్వామి,అమ్మవార్లను మల్లె పుష్పాలతో అలంకరించారు.


ఉమారామలింగేశ్వరస్వామి

విజేతలకు శుభాకాంక్షల వెల్లువ

» ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికైనవారికి నాయకుల అభినందనలు, సత్కారాలు
» పలుచోట్ల ఊరేగింపులు


జగ్గంపేటలో నెహ్రూకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, టీడీపీ శ్రేణులు

జగ్గంపేట, జూన్ 5: జగ్గంపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన జ్యోతుల నెహ్రూకు స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రజాప్రతినిధులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తమ అభిమాన నేతను ఘనంగా సత్కరిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. నెహ్రూకు ఆదిత్య విద్యాసంస్థ అధినేత నల్లమిల్లి శేషారెడ్డి కుమారుడు నల్లమిల్లి సతీష్ రెడ్డి కలిసి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. జగ్గంపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అధ్యక్షులు పాలకుర్తి సురేష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు జ్యోతుల నెహ్రూను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

గండేపల్లి: జగ్గంపేటలోని టీడీపీ కార్యాలయానికి గండేపల్లి మండల టీడీపీ, నాయకులు వెళ్లి గజమాలలు వేసి నెహ్రూను సత్కరించి కేక్ కట్ చేసి అభినందించారు. మురారి, గండేపల్లి, మల్లేపల్లి, తాళ్ళూరు, బొర్రంపాలెం నాయకులంతా అధిక సంఖ్యలో తరలివచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, యువ నాయకులు జాస్తి వసంత్, సుంకవిల్లి రాజు, గద్దే అబ్బన్న, వెంకన్నదొర, వల్లభరెడ్డి రామకృష్ణ, ఆళ్ల సత్తిబాబు, వెంపాటి రాజు, శీలామంతుల వీరబాబు, పైన్ని వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి బాబ్జి, అడబాల ఆంజనేయులు, దొమ్మా శ్రీను, తెలగరెడ్డి భద్రరావు, దార్లంక శ్రీనివాస్, పిల్లా సత్యనారాయణ, పోతుల దుర్గాప్రసాద్, తణుకు దుర్గారావు, కంచర్ల సుబ్రహ్మణ్యం, తెలగరెడ్డి ప్రకాశ్, వల్లభశెట్టి కోటేశ్వరరావు, రామకుర్తి నరసింహం, వల్లభశెట్టి వీరభద్రం పాల్గొన్నారు. జడ్.రాగంపేట గ్రామానికి చెందిన కందుల చిట్టిబాబు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి తీన్‌మార్ ఊరేగింపుతో జగ్గంపేట వచ్చి జ్యోతుల నెహ్రూను గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

యనమల దివ్యకు ఘన స్వాగతం


తొండంగి మండలం ఏవినగరంలో దివ్యకు స్వాగతం పలుకుతున్న మహిళలు

తొండంగి, జూన్ 5: తుని ఎమ్మెల్యేగా గెలుపొందిన యనమల దివ్య తొలిసారిగా స్వగ్రామమైన ఏవినగరంలో పర్యటించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో భర్త గోపీ చంద్‌తో కలిసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయం, రామాలయం, కృష్ణాలయాల్లో పూజలు నిర్వహించారు. బంధువుల ఇళ్లకు వెళ్లి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. గ్రామ దళిత వాడలో అంబేడ్కర్, జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వగృహంలో తనకు అభినందనలు తెలపడానికి వచ్చిన వారిని కలిసి తన విజయానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. తొలి సారిగా గ్రామానికి వచ్చిన దివ్యకు ఘన స్వాగతం లభించింది. భాజా భజంత్రీలతో, బాణసంచా కాల్పులతో గ్రామ సరిహద్దుల నుంచి స్వాగతించి తోడ్కొని వెళ్లారు. ఆమె వెంట యనమల రాజేష్, యనమల నాగేశ్వరావు, అరిగెల నర్సింహమూర్తి, పిర్ల శివ, కె.శ్రీనుబాబు ఉన్నారు.

తుని రూరల్: యనమల దివ్యకు తేటగుంలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ప్రసిద్ధి దేవాలయం శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి ఆలయంలో దివ్య దంపతులు ప్రత్యేక పూజలు ఆచరించారు. వారికి ఆలయ అర్చకులతో పాటుగా చైర్మన్ పేరూరి గాంధీ పూర్ణకుంభంతో స్వాగతం పలికి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామ నాయకులు గజ్జి అప్పలరాజు, గజ్జి రాంబాబు కొల్లు సత్యనారాయణ, పేరూరి కృష్ణ, కోనా కన్నారావు, కలగా శ్రీను, ఖాతా గోవిందు, జనసేన నేతలు మర్రి వీరబాబు, గెట్ట శివ ఉన్నారు.

కొండబాబుకు అభినందనలు


కాకినాడలో కొండబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న నాయకులు

కాకినాడ సిటీ, జూన్ 5: కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా విజయం సాధించిన వనమాడి కొండబాబును బుధవారం ఆయన నివాసంలో పలువురు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వివిధ వర్గాల వారు కొండబాబుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, రూరల్ టీడీపీ నాయకులు ఆర్.సీతయ్యదొర తదితరులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సంగిశెట్టి అశోక్, నాయకులు పంతాడి రాజు, వాసంశెట్టి చిట్టప్ప పాల్గొన్నారు.

కార్పొరేషన్: కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా గెలుపొందిన వనమాడి కొండబాబును కాకినాడ పార్లమెంటు ఎన్నికల కమిటీ సభ్యుడు డాక్టర్ మల్లాడి రాజేంద్రప్రసాద్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గండి సుబ్బరాజు, వీరేళ్ల ఏసు, గరిగిన పెద్దరాజు,పాలెపు గణేష్ ఉన్నారు.

రాజప్పకు శుభాకాంక్షలు


సామర్లకోట: చినరాజప్పకు పూలదండలు వేసి అభినందిస్తున్న టీడీపీ నాయకులు

పెద్దాపురం, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో విజయ దుందుభి మోగించిన ఎమ్మెల్యే విజేత నిమ్మకాయల చినరాజప్పకు బుధవారం శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. స్థానిక సుధా కాలనీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను నియోజకవర్గం నుంచి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియచేశారు. రాజప్పను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. రాజప్ప మాట్లాడుతూ కూటమి విజయం రాష్ట్ర ప్రజలకు చెందుతుందని, విజయంతో తమ బాధ్యత పెరిగిందన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రాధాన్యమిస్తామన్నారు.

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గం నుంచి మూడోసారి విజయ దుందుభి మోగించిన ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను బుధవారం అచ్చంపేటలో పలువురు నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ముంచెత్తి అభినందించారు. రానున్న కాలంలో రాజప్ప సారథ్యంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. సామర్లకోట మండల, పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సత్యప్రభకు అభినందనలు


ప్రత్తిపాడులో సత్యప్రభను అభినందిస్తున్న బీసీ నాయకుడు కోళ్ళ రవి

ప్రత్తిపాడు, జూన్ 5: ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన వరుపుల సత్యప్రభ రాజాను నియోజకవర్గంలోని అభిమానులు, నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందించారు. టీడీపీ కార్యాలయానికి తరలివచ్చి పూలబొకేలు అందజేసి అభినందించారు. సత్యప్రభ ఎన్నికల ధ్రువపత్రాన్ని పెదశంకర్లపూడిలో రాజా సమాధిపై ఉంచి తన భర్తకు అంకితం ఇచ్చారు. రాజా ఆశయ సాధనకు, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కాకినాడ జిల్లా బీసీ సంఘ నాయకుడు కోళ్ల రవిబాబు బృందం సత్యప్రభకు బొకే అందజేసి అభినందించారు. అనంతరం సత్యప్రభ తేటగుంట తరలివెళ్లి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే అందజేశారు. టీడీపీ నాయకులు యాళ్ళ జగదీష్, అంబటి రాంబాబు తదితరులున్నారు.

పురందేశ్వరికి అభినందన

ప్రత్తిపాడు, జూన్ 5: రాజమండ్రి ఎంపీగా గెలిచిన దగ్గుపాటి పురందేశ్వరిని ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన జిల్లా బీజేపీ అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మడి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి మట్టామంగరాజు, యార్లగడ్డ వెంకట్రాయుడు కలిసి అభినందించారు. అనంతరం స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద మండల బీజేపీ నాయకులు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజు, రాజా కింగ్‌బాబు రాజు, మదినే బాబ్జి పాల్గొన్నారు. నర్సీపట్నంలో విజయం సాధించిన చింతకాయల అయ్యన్న పాత్రుడును నియోజకవర్గ నాయకులు నర్సీపట్నం వెళ్లి అభినందించారు. మండలంలోని రాచపల్లికి చెందిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బుద్ధరాజు చంటిరాజు, జిల్లా బీసీ సంఘ నాయకుడు కోళ్ళ రవిబాబు ఉన్నారు.

వంగలపూడి అనితకు సత్కారం

కాకినాడ సిటీ, జూన్ 5: రాష్ట్ర ప్రజలు ధర్మాన్ని గెలిపించారని అనకాపలి జిల్లా పాయకరావుపేట టీడీపీ ఎన్నికల పరిశీలకుడు, టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే విజేత వంగలపూడి అనితను బుధవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎంతో కష్టపడి పనిచేశారని కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల కోఆర్డినేటర్ సానా సతీష్, కాకినాడ ఎంపీ విజేత తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

టీడీపీ, జనసేన సంబరాలు


పిఠాపురం మండలం బోగాపురంలో కేక్ కట్ చేస్తున్న విజయకుమార్

పిఠాపురం రూరల్, జూన్ 5: రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం సాధించడం, పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రికార్డు స్థాయి మెజార్టీతో గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బోగాపురంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లుమల్లు విజయకుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, జనసైనికులు కేక్‌ను కట్ చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కల్యాణ్, మాజీ ఎమ్మెల్యే వర్మలకు తమ అభినందనలు తెలిపారు.

రౌతులపూడి: కూటమి విజయంపై రౌతులపూడి, మూలగపూడి గ్రామాల్లో టీడీపీ-జనసేన నేతలు సంబరాలు చేసుకున్నారు. మూలగపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీటీసీ యామల సురేష్, జనసేన నేతలు కోరుప్రోలు నానాజీ, బాబ్జీ ఆధ్వర్యంలో కేట్ కట్ చేశారు. రౌతులపూడిలో చామంద్ర రాంబాబు, పెద్ద అబ్బు, కొత్తేల చంటి మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు ఆధ్వర్యంలో కేట్ కట్ చేశారు. లాలం రమణ దుర్గాదేవి అమ్మవారికి మేకపోతును వేసి మొక్కు తీర్చుకోగా తోట శివ ఆంజనేయస్వామికి 108 కొబ్బరికాయలు కొట్టాడు. కార్యక్రమంలో కర్రి అప్పలనాయుడు చిటికెల అప్పలనాయుడు, గొల్లు గోపీ తదితరులు పాల్గొన్నారు.


రౌతులపూడి మండలం మూలగపూడిలో కేక్ తినిపిస్తున్న జనసేన, టీడీపీ నేతలు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

» డీఎఫ్‌వో భరణి » ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం » మొక్కలు నాటిన అధికారులు » పలుచోట్ల ర్యాలీలు


పెద్దాపురంలో మొక్కలు నాటుతున్న డీఎఫ్‌వో, కాకినాడలో మొక్కలు నాటుతున్న ప్రవీణ

పెద్దాపురం, జూన్ 5: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డీఎఫ్‌వో భరణి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జవహర్ నవోదయా విద్యాలయంలో ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రోజురోజుకూ పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతీ ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలన్నారు. నవోదయా విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. అలాగే వరహాలయ్యపేటలో యాసలపు సూర్యారావు భవనంలో పెద్దపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అలాగే స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మొక్కలు నాటారు.

కార్పొరేషన్ (కాకినాడ): పర్యావరణ సమతుల్యత పాటించడానికి అందరూ మొక్కలు నాటి కాలుష్యం నుంచి సభ్య సమాజాన్ని కాపాడుకోవాలని స్త్రీ, సంక్షేమశాఖ పీడీ, సాధికారిత అధికారిణి కొండా ప్రవీణ పిలుపునిచ్చారు. కాకినాడ అశోక్‌నగర్‌లో శిశు గృహావరణం, పరివర్తన చిల్డ్రన్ హోమ్‌లోను పీడీ మొక్కలు నాటారు. అన్ని ఐసీడీఎస్‌ల పరిధిలో అంగన్‌వాడీల్లో మొక్కలు నాటారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి వెంకట్రావు, నోడల్ ఆఫీసర్ లక్ష్మి, పరివర్తన హోమ్ ఇన్‌చార్జి వక్కలంక రామకృష్ణ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: మన భూమి మన భవిష్యత్తు అని, పర్యావరణంలో మానవుడు అంతర్భాగమని, పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా విరివిగా మొక్కలు పెంచాలని జిల్లా కన్స్యూమర్స్ ఫోరమ్ జడ్జి చక్కా సుశి, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ఎస్ అనూషా కోరారు. బుధవారం ఉమర్ ఆలీషా రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్ట్ కాకినాడ శాఖ కన్వీనర్ పేరూరి సూరిబాబు ఆధ్వర్యంలో వాకలపూడి శ్రీవిశ్వ విజ్ఞాన విద్యాత్మిక పీఠంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. వలంటీర్లు, గ్రామస్థులకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం వాకలపూడి ఆశ్రమం నుంచి సర్పవరం జంక్షన్ వరకు నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. వేసవిలో పక్షులు, పశువులు, మజ్జిగ చలివేంద్రంలో సేలు అందించిన వలంటీర్లకు ప్రసాదం, మాస పత్రిక అందించారు. పీఆర్‌జీసీ రిటైర్డ్ పీడీ కె.వీరభద్రరావు, కాకినాడ లక్ష్మి, సత్యవతి, పేరూరి బాబ్జీ, దాట్ల శ్రీదేవి, చిర్ల లలిత, రెడ్డి సూర్యప్రభావతి, వనుం మణి పాల్గొన్నారు.

కరప: ప్రతీఒక్కరూ సామాజిక బాధ్యతతో మెలుగుతూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని గ్రీన్ కోర్ ఆఫీసర్ తెలగాని వెంకట్రావు సూచించారు. పెద్దాపురప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. హైస్కూల్ హెచ్ఎం ఎస్ఎస్ఎస్ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కలిగించారు. వెంకట్రావు మిషన్ ఆఫ్ లైఫ్ (ఎకో క్లబ్) ఏర్పాటు చేసి క్లబ్‌పై విద్యార్థులకు వివరించారు. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు మొక్కలు నాటుదామని, ఇందన పొదుపు పాటించాలని, నీటి వృథాను నివారిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏకో క్లబ్ కన్వీనర్ బి.ఈశ్వరరాజు, సభ్యులు ఉమా శ్రీదేవి, ప్రియదర్శిని, నాగరాజేశ్వరి, గ్రీన్ సోల్జర్స్ పాల్గొన్నారు.

సామర్లకోట: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం అందరి పైనా ఉందని సామర్లకోట ఎంఈవో వై.శివరామకృష్ణయ్య అన్నారు. వేట్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడారు. పీవి. సత్యన్నారాయణ, ఎస్వీవీఎస్ఎస్.కుమారి, బి.వెంకటలక్ష్మి, కెవీ. రామలక్ష్మి, ఎం.బాబూరావు, పి.రుూన్సీ పాల్గొన్నారు. సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే సిబ్బందిచే ప్రతిజ్ఞ నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. రైల్వే వైద్యాధికారి చెన్నకేశవరెడ్డి, ఎస్ఎస్.శ్రీధర్, కళ్యాణి, రవికాంత్, శ్రీదేవి తదితరులున్నారు.

గండేపల్లి: సూరంపాలెంలోని ఆదిత్య విద్యాసంస్థల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో డిప్యూటీ ప్రొచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మొక్కలు నాటారు. గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ విజయభార్గవి, విభాగాధిపతి గోవర్ధన్‌రెడ్డి, ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల ఫోరెనిక్స్ సైన్స్ విభాగం నందు జాతీయ సేవా పథకం యూనిట్ కమిటీ ఆధ్వర్యంలో సూరంపాలెంలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో డైరెక్టర్ సత్యనారాయణ, రామకృష్ణ, తోటకూర గంగాధర్, శుభాకర్, వినయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు విలాస్‌అనిల్ చావన్, ఉపాధ్యాయుడు పివి నాగేశ్వరరావు, కోఆర్డినేటర్ విద్యాసాగర్ ఉన్నారు.

తొండంగి: మండలంలో ఒంటిమామిడి దివిస్ లేబరేటిస్ సంస్థ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ర్యాలీలు నిర్వహించి మొక్కలు నాటారు. ఎంఈవోలు షేక్ బాబ్జి, సుబ్బిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో కోర్టు ఆవరణ మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ బొంగుఖారు మధుబాబు, కోర్టు సిబ్బంది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

ఏలేశ్వరం: స్థానిక గ్రంథాలయ పాలకులు కవికొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలో పలు వీధుల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు వెన్నా శ్రీనివాస్, ఎమ్.లోవప్రసాద్, ఎమ్.విజయలక్ష్మి, వై.నాగమణి, ఎ.చక్రీ తదితరులున్నారు.



కరప: పెద్దాపురప్పాడులో అవగాహన ర్యాలీ , ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

గొల్లప్రోలు సొసైటీ చైర్మన్ జ్యోతుల రాజీనామా

గొల్లప్రోలు, జూన్ 5: గొల్లప్రోలు విశాల సహకార పరపతి సంఘం(సొసైటీ) చైర్‌పర్సన్ జ్యోతుల భీముడు తన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రంలో వైసీపీ ఓడిపోయి కూటమి ప్రభుత్వం ఏర్పడనున్న నేపథ్యంలో గత ప్రభుత్వం ద్వారా పదవి పొంది జూలై 30వ తేది వరకూ పదవీకాలం ఉన్నప్పటికి తనతో పాటు డైరెక్టర్లు రామిశెట్టి సత్తిబాబు, యెన్నేటి బాబురావుతో కలిసి తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు సహకారశాఖ డిప్యూటీ రిజిస్ట్రార్‌కు తన రాజీనామా లేఖను పంపినట్టు బుధవారం తెలిపారు.

రైతులకు తూరలు వితరణ

రౌతులపూడి, జూన్ 5: రైతుల కోసం టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు రూ.30 వేలు విలువ గల తూరలు ఇచ్చారు. రేగుల చెరువు రహదారి నిమిత్తం ప్రభుత్వం గ్రావెల్ రహదారి వేసేందుకు నిధులు మంజూరు చేసింది. ఎగువ పొలాల నుంచి నీరు పోయేందుకు 2చోట్ల తూరలు వేయాల్సి ఉంది. దీంతో రహదారి పనులు నిలిచిపోకుండా మాజీ ఎంపీపీ సొంత నిధులతో తూరలు కోనుగోలు చేసి రైతులకు అందజేశారు. నీరు పోయేందుకు రహదారి పొడవునా జేసీబీతో కాలువ తవ్వించారు. రైతులు హర్షం వ్యక్తం చేశారు.

చేతిపంపు ఏర్పాటు పనుల పరిశీలన

ఏలేశ్వరం, జూన్ 5: పట్టణంలో విజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ. 1 లక్షతో 9వ వార్డు ఎరుకల వీధిలో తాగునీరు ఏర్పాటుకు చైర్మన్ డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు చేతిపంపు ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. బుధవారం ఈ పనులను కౌన్సిలర్ అలమండ చలమయ్య, సఖిరెడ్డి ప్రభతో కలిసి పరిశీలించారు. విజయబాబు మాట్లాడుతూ విజయ ఫౌండేషన్ ద్వారా పేదలకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారమని, దానిలో భాగంగా తాగునీరు ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. బుగతా శ్రీను, చందక శ్రీను, వైబోగుల సుబ్బారావు పాల్గొన్నారు.

రాచపల్లిలో అరుణాచలేశ్వరునికి పూజలు

ప్రత్తిపాడు, జూన్ 5: రాచపల్లిలో అరుణాచలేశ్వరునికి బుధవారం విశిష్ట పూజలు నిర్వహించారు. రమణ సేవాశ్రమం నిర్వాహకుడు రామానంద స్వామి ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.